క్లుప్తంగా

రైతులకు మొక్కల పంపిణీ



టెంకాయ మొక్కలను అందజేస్తున్న దృశ్యం

పాణ్యం : ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉచితంగా టెంకాయ, మామిడి మొక్కలను పంపిణీ చేస్తున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ రామ నరసింహులు తెలిపారు. శనివారం మండలానికి వచ్చిన మొక్కలను రైతులకు అందించారు. ఆయన మాట్లాడుతూ.. రైతుల విజ్ఞప్తి మేరకు 1,800 టెంకాయ మొక్కలు, 170 మామిడి మొక్కలు తెప్పించామన్నారు. గతంలో రైతులు తమకు ఫలానా మొక్కలు కావాలని దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఎకరానికి టెంకాయ మొక్కలు 60 చొప్పున, మామిడి ఎకరానికి 70 మొక్కల చొప్పున అందించామని చెప్పారు. 30 మంది రైతులకు సంబంధించి ఈ మొక్కలు వచ్చినట్లు చెప్పారు.

పరిశుభ్రత పాటించాలి



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సునీత

సి.బెళగల్: వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని పీహెచ్‌సీ డాక్టర్ సునీత హాస్టల్ విద్యార్థులకు సూచించారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పించారు. 72 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. 25 మంది విద్యార్థులకు రక్త పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ విజేయుడు, ఏఎన్‌ఎం పుష్పలత పాల్గొన్నారు.

వరుణుడి కరుణ కోసం..



తుంగభద్ర నది నుంచి బిందెలతో నీటిని తెచ్చిన వెంకటగిరి వాసులు

కోడుమూరు రూరల్: వరుణుడి కరుణ కోసం మండలంలోని వెంకటగిరి రైతులు గ్రామంలోని దేవుళ్లకు నదీ జలాలతో అభిషేకం చేశారు. వర్షాకాలం ప్రారంభమైనా వానలు పడకపోవడంతో పలువురు రైతులు శనివారం పాదయాత్రగా బ్రహ్మగుండం, తుంగభద్ర నదికి వెళ్లి అక్కడి జలాలను బిందెలతో తెచ్చి దేవుళ్లకు అభిషేకించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 'వర్షాలు కురవాలి వాన దేవుడా.. పంటలే పండాలి వాన దేవుడా' అంటూ భక్తితో దేవుళ్లను వేడుకున్నారు.

బుగ్గరామేశ్వరుడికి బంగారు రుద్రాక్షమాల



రుద్రాక్ష మాలను ఆలయ అధికారులకు అప్పగిస్తున్న విశ్వనాథరెడ్డి దంపతులు

ఓర్వకల్లు : మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రంలోని బుగ్గరామేశ్వరస్వామికి ఓ భక్తుడు బంగారు రుద్రాక్ష మాలను బహూకరించాడు. శనివారం ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు కర్నూలు నగరంలోని అమృత హాస్పిటల్ అధినేత, న్యూరో సర్జన్ డాక్టర్.విశ్వనాథరెడ్డి దంపతులు ఆలయాన్ని సందర్శించి, స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత స్వాముల వారిపై ఉన్న భక్తితో 4.66 తులాలతో తయారు చేసిన బంగారు రుద్రాక్ష మాలను ఆలయ అధికారులకు అప్పగించి మొక్కులు తీర్చుకున్నారన్నారు. ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం రుద్రాక్షమాల రూ.2,1500ల విలువ చేస్తుందని చెప్పారు. దాతలను స్వాముల వారి చిత్రపటాన్ని బహూకరించి, శాలువ, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కళ్లె. లక్ష్మినారాయణశర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా రోడ్డు విస్తరణ పనులు



రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 19వ వార్డులో సుద్ద వాగు నుంచి సాయివైభవ్ నగర్ వరకు రూ.1.60కోట్లతో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. శనివారం నగర పాలక సంస్థ డీఈఈ రవిప్రకాష్ నాయుడు, ఏఈ జనార్దన్ పనులను పరిశీలించి నాణ్యత ప్రమాణాలను తనిఖీ చేశారు. మూడు నెలలో పనులు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.

జగనన్న సురక్ష.. పేదలకు శ్రీరామరక్ష

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- మీదివేములలో 'జగనన్న సురక్ష'



మిదివేములలో ప్రజలకు ధ్రువ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

ఓర్వకల్లు: రాష్ట్ర ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేద కుటుంబాలకు శ్రీరామరక్షని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అభివర్ణించారు. అర్హతకల్గి సంక్షేమ పథకాలు అందని వారికి ఈ కార్యక్రమం ప్రయోజనకరమన్నారు. శనివారం మండలంలోని మీదివేముల, శకునాల గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. శకునాలలో తహసీల్దార్ శివప్రసాద్‌రెడ్డి బృందం, మీదివేములలో ఎంపీడీఓ శివనాగప్రసాద్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసానితో పాటు, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యులు రంగనాథ్‌గౌడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఉద్దేశంతోనే వలంటరీ వ్యవస్థను అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి సచివాలయ వ్యవస్థ, వలంటరీ వ్యవస్థలు రెండు కళ్లలాంటివని అభిప్రాయపడ్డారు. వీటి ద్వారా అందుతున్న సేవలను జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు, పచ్చమీడియాలు దుష్ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మీదివేముల ప్రధానోపాధ్యాయుని విన్నపం మేరకు హాస్టల్ విద్యార్థుల సౌలభ్యం కోసం డైనింగ్ షెడ్‌ను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం 957 మందికి ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సర్పంచులు రజతమ్మ, జంగం రాధిక, సచివాలయ మండల కన్వీనర్ లోటర్‌బాషా, కాల్వ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు: మండలంలోని పెద్దటేకూరు గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని పాల్గొని లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ టీవీ రమేష్ బాబు, ఈఓఆర్డీ రవికిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: సచివాలయం వద్ద ఎంపీపీ ఉసేన్‌బీ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆలమూరు సచివాలయం పరిధిలో 478 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ మహ్మద్‌షరీఫ్, మండల సచివాలయాల కన్వీనర్ గుద్దెటి సుమంత్‌రెడ్డి, ఎంపీడీఓ దస్తగిరి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లు జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజలు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల సచివాలయం జగనన్న సురక్ష శనివారం సమావేశం నిర్వహించారు. సర్పంచ్ రామ్మోహన్ రెడ్డి లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోదా ప్రసాద్, ఎంపీటీసీ జక్కుల సావిత్రి, కో ఆప్షన్ సభ్యుడు హుస్సేన్ బాషా, భోగేశ్వరం టెంపుల్ చైర్మన్ సునీల్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో ప్రతి గడపకూ లబ్ధి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పెద్దటేకూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. ఎమ్మెల్యే గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది సకాలంలో తెలియజేస్తున్నారా? లేదా ? అని ఆరా తీశారు. అలాగే వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి పరిపాలన అందిస్తున్నారన్నారు. ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని ప్రజలు సద్వినియోగం చేసుకొని జీవనప్రమాణాలను మెరుగు చేసుకొవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ రమేష్‌బాబు, జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ మునిస్వామి, కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



పెద్దటేకూరులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

ఓర్వకల్లు: మండలంలోని మీదివేముల గ్రామంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కొత్త బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, కురువ వీధి, గొల్లపేటలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఇంటింటి వద్ద ప్రజల యోగక్షేమాలు, సమస్యలను తెలుసుకుంటూనే, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న జనరంజక పాలన, సంక్షేమ పథకాల అమలుతీరు గూర్చి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివనాగప్రసాద్, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, మండల ఉపాధ్యక్షులు పద్మనాభరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ లోటర్ బాషా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సురక్షతో సత్వర పరిష్కారం



గొందిపర్లలో మహిళకు సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్)/గూడూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంతో సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం గొందిపర్ల గ్రామం, బాలాజీనగర్, గూడూరు మండలంలోని బూడిదపాడు గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరై వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల్లో సమస్యలు పరిష్కారం కాకపోతే జగనన్న సురక్ష కార్యక్రమంలో కచ్చితంగా పరిష్కారం చూపాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. గతంలో ఏదైనా ధ్రువీకరణ పత్రం కావాలంటే కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం అత్యంత తక్కువ సమయంలో, పైసా ఖర్చు లేకుండా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్లు ఇస్తున్నారన్నారు. ఇలాంటి అవకాశాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, వైస్ ఎంపీపీ2 నెహమ్యా, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, సచివాలయ కన్వీనర్లు గోపాల్, 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహారెడ్డి, కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ పాల్గొన్నారు. బూడిదపాడు కార్యక్రమంలో సర్పంచు పార్వతమ్మ, ఎంపీటీసీ చంద్రమ్మ, నాయకులు ఈరన్న, వరశేఖర్, కొండారెడ్డి, నాగరాజు, మహేశ్వరరెడ్డి, సుబ్బన్న, రాజశేఖర్, తహసీల్దార్ శివశంకర్‌నాయక్, ఎంపీడీఓ మాధవీలత పాల్గొన్నారు.

కోడుమూరు రూరల్: మండలంలోని లద్దగిరి గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి పాల్గొని పలువురికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు క్రిష్టారెడ్డి, తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

సి.బెళగల్: సెల్‌ఫోన్ టవర్ రిమోట్ చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పీరయ్య శనివారం తెలిపారు. పోలకల్ గ్రామ శివారులోని ఎయిర్‌టెల్ సెల్‌ఫోన్ టవర్ రేడియో రిమోట్ యూనిట్ (ఆర్ఆర్‌యూ)ను మే 29న గుర్తు తెలియని దుండగులు చోరీ అయ్యిందని సెక్యూరిటీ సూపర్‌వైజర్ తిమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో ప్రజలకు శనివారం ఈఓఆర్డీ సందీప్ పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిక్షణపై అవగాహన కల్పించారు.

వలంటీర్లపై విషం చిమ్మడం తగదు

కర్నూలు(రాజ్‌విహార్): సేవా గుణంతో పనిచేసే వలంటీర్లపై విషం చిమ్మడం తగదని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వలంటీర్లు 90 శాంతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలే అన్నారు. వీరు నిజాయితీగా పని చేస్తున్న వారి ఆత్మస్థైర్యం దెబ్బతినే విధంగా జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ మాట్లాడటం తగదన్నారు. ని, జన్మభూమి కమిటీ సభ్యుల మాదిరిగా టీడీపీ వర్గాలకు, మామూళ్లు ఇచ్చిన వాళ్లకు పథకాలు అందించడం లేదన్నారు.

పాఠశాలల తనిఖీ

సి.బెళగల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌ను శనివారం ఎంపీడీఓ రాముడు, ఎంఈఓ - 2 ఆదామ్‌బాషా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం రుచి చూసి, మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే పోలకల్ గ్రామ సచివాలయాలు -1, 2 లను ఎంపీడీఓ, కంబదహాల్, గొల్లలదొడ్డి గ్రామాల పాఠశాలలను ఎంఈఓ-2 ఆదామ్‌బాషా తనిఖీ చేశారు.

సర్వేను వేగవంతం చేయాలి

కోడుమూరు: మండలంలో జరుగుతున్న పోల్ టూ పోల్ జియోట్యాగింగ్ సర్వేను వేగవంతం చేయాలని ఏపీఎస్‌పీడీసీఎల్ ఆపరేషన్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని కోడుమూరు, లద్దగిరి గ్రామాల్లో ఎస్‌ఈ ఉమాపతి పర్యటించి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ ప్రతి పోల్‌ను జియోట్యాగింగ్ చేసి స్టిక్కర్ వేయడం జరుగుతుందని, తద్వారా భవిష్యత్‌లో కరెంట్ సప్‌లైలో ఎలాంటి సమస్య వచ్చినా త్వరగా పరిష్కరించేందుకు వీలవుతుందన్నారు.

జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులకు అభినందనలు



జాతీయ స్థాయి హాకీ క్రీడాకారులను శాలువా,మెమొంటోలతో సన్మానిస్తున్న మంత్రి రోజా

కర్నూలు (న్యూటౌన్): జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొన్న కర్నూలు మండలం గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రశాంత్, హిమబిందులను క్రీడాశాఖ మంత్రి రోజా, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అభినందించారు. శనివారం ఉదయం పగిడ్యాల ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి వెళ్తున్న సందర్భంగా గార్గేయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. క్రీడాకారులను శాలువా, మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణ చేపట్టండి



మాట్లాడుతున్న చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు

గూడూరు: పట్టణంలో రహదారుల విస్తరణ చేపట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం నగర పంచాయతీ కార్యాలయంలో సర్వ సభ్యసమావేశం చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న పాల్గొన్నారు. సమావేశంలో 10వ వార్డు కౌన్సిలర్ రేమట సురేష్ మాట్లాడుతూ పట్టణంలో వాహనాల కాకపోకలకు తీవ్ర ఇబ్బందులున్నాయని, ప్రధాన రహదారులు అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. చైర్మన్ మాట్లాడుతూ పట్టణంలో తాగునీటి సమస్య తీర్చామన్నారు. నిధుల కొరత వల్ల కొంత ఇబ్బంది ఉందని, సభ్యులు సహకరించాలని కోరారు. పట్టణంలో పలు వార్డుల్లో శానిటేషన్ సక్రమంగా చేపట్టడం లేదని దీని వల్ల మలేరియా, విష జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేయగా శానిటేషన్ సమస్య ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని చైర్మన్ అధికారులను ఆదేశించారు. అనంతరం పలు అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఏఈ నరసింహులు, టీపీఎస్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దస్తగిరి, పద్మావతి, కళామ్, తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువును అందుబాటులో ఉంచాలి

పాణ్యం: గ్రామంలో సేకరించిన వ్యర్థాల నుంచి తయారైన సేంద్రియ ఎరువును రైతులకు అందుబాటులో ఉంచాలని డీపీఓ మంజులవాణి సూచించారు. శనివారం పాణ్యంలోని వర్మి కంపోస్టు యూనిట్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం తడి, పొడి చెత్తను వేరుగా సేకరిస్తున్నామని, వాటిని వర్మీ యూనిట్‌లో వేరు చేసిన తర్వాత వానపాములకు ఆహారంగా వేయడం జరుగుతుందన్నారు. తయారైన వర్మీ ఎరువును రైతులకు విక్రయించాలని సూచించారు. ఈ విషయాన్ని అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ప్రస్తుతం ఎంత ఎరువు అందుబాటులో ఉంది, నెలకు ఎంత తయారవుతుందనే విషయాలపై ఆరా తీశారు. అలాగే క్లాప్ సిబ్బంది తీసుకొస్తున్న ప్లాస్టిక్, గాజుబాటిళ్లను కూడా మిషన్ల సహాయంతో పొడి చేయాలన్నారు. వాటిని కూడా ప్రత్యేకంగా ప్యాక్ చేసి విక్రయించుకోవాలన్నారు. ఇనుప ముక్కలు, గాజుబాటిళ్లు, ప్లాస్టిక్‌ను కూడా వృథా చేయరాదన్నారు. అలాగే గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.



గాజు బాటిళ్లను ముక్కలు చేసే యంత్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ మంజులవాణి

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి



సిబ్బందితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామగిడ్డయ్య

కర్నూలు (న్యూటౌన్): గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి రామగిడ్డయ్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఈ తాండ్రపాడు పీహెచ్‌సీ పరిధిలోని నిడ్జూరు గ్రామంలో 104 వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం రోజా వీధిలోని యూపీహెచ్‌సీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగులందరికీ మందులు అందించాలని సూచించారు. డెంగీ కేసులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.కార్యక్రమంలో 104 సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే 'స్పందన'

పాణ్యం : ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ఆయా గ్రామ సచివాలయాల్లోనే నిర్వహించాలని ఎంపీడీఓ దస్తగిరి శనివారం ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు స్పందన నిర్వహించి ప్రజలు ఇచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొనాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయంలోనే స్పందన ఉంటుందనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు.

అందరూ ఇళ్లు నిర్మించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భార్గవ్‌తేజ

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇంటి స్థలం మంజూరైన వారందరూ గృహాలు నిర్మించుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ భార్గవ్‌తేజ అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ ఇందిరమ్మ కాలనీ లేఅవుట్ కాలనీలో ఇంటి స్థలం పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులందరికి 20 టన్నుల ఇసుక ఉచితంగా అందిస్తామని, సిమెంట్, ఉక్కు అతి తక్కువ ధరకు సరఫరా చేస్తామన్నారు. కాలనీలో ఇప్పటికే మౌలిక వసతులు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్, డీఈఈ గోపాల కృష్ణ, హౌసింగ్ డీఈ ప్రభాకర్, కార్పొరేటర్లు శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు



పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేశామని ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పులకుర్తి గ్రామంలో ఆయన పర్యటించారు. నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించి, సంక్షేమ క్యాలెండర్‌ను అందజేశారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, వీధిలైట్లు, తాగు, ఇళ్లు కావాలని బీసీ కాలనీ, కోటవీధి, ముస్లిం కాలనీల వాసులు కోరగా స్పందించిన ఎమ్మెల్యే.. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ ఇమ్మానేయులు, నేతలు సత్యారెడ్డి, లక్ష్మన్న, గిడ్డయ్య, మాధవరావు, గిరి, నాగేంద్ర, సోమశేఖర్ యాదవ్, గోపాల్ పాల్గొన్నారు.